క్లుప్తంగా

దొర్నిపాడు తహసీల్దార్‌గా నాగరాజు



దొర్నిపాడు: తహసీల్దార్‌గా నాగరాజును నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన అనంతపురం జిల్లా తాడిమర్రి మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వస్తున్నారు. ఇక్కడ పనిచేస్తున్న జయప్రసాద్ అనంతపురం జిల్లా ఎల్లనూరు మండలానికి బదిలీ అయ్యారు. నూతన తహసీల్దార్ సోమవారం బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉందని కార్యాలయ వర్గాలు తెలిపాయి.

ఆసరాతో జీవనప్రమాణాలు మెరుగు



మాట్లాడుతున్న కౌన్సిలర్ సాదిక్‌బాషా

నంద్యాల(సిటీ): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ ఆసరా పథకంతో పేదల జీవనప్రమాణాలు మెరుగయ్యాయని మెప్మా సీఎంఎం విజయభాస్కర్ రెడ్డి అన్నారు. ఆదివారం 2వ వార్డులో వైఎస్సార్ ఆసరా 4వ విడత సంబరాలు కౌన్సిలర్ సాదిక్ బాషా ఆధ్వర్యంలో నిర్వహించారు. సాదిక్ బాషా మాట్లాడుతూ తమ ప్రభుత్వం పొదుపు మహిళలకు అండగా నిలిచిందని చెప్పారు.

వైభవంగా పుష్పయాగం



వాసవీ కన్యకాపరమేశ్వరికి ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని అమ్మవారిశాలలో శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవికి వాసవీ దీక్షా మండలి ఆధ్వర్యంలో మహాపుష్పయాగం వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం చేపట్టారు. అనంతరం 102 మంది మహిళలతో చెరువు కట్ట నుంచి అభిషేక జలాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారి ఉత్సవ మూర్తిని అభిషేకించారు. అనంతరం ఫల,పుష్ప, సుగంధ ద్రవ్యాలు, పంచామృతాలతో అభిషేకించి, వివిధ రకాల పుష్పాలతో అలంకరించి అమ్మవారికి పూలంగిసేవ కార్యక్రమం జరిపించి మహామంగళ హారతులు ఇచ్చారు. సాయంత్రం ఉత్సవమూర్తిని పురవీధుతో దీపోత్సవంతో గ్రామోత్సవం నిర్వహించారు. వాసవీ, ఆర్యవైశ్య సంఘం, వైశ్య యువజన సంఘం, వాసవీ యూత్‌క్లబ్, వాసవీ మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యుత్ వేళలు

ఉయ్యాలవాడ : మండలంలోని రైతులకు పగటిపూట ఉచిత విద్యుత్ సరఫరా అందిస్తున్నట్లు ఏఈ గురప్ప తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి వారం రోజుల పాటు సుద్దమల్ల, మాయలూరు ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు, ఇంజేడు, కొండుపల్లె, హరివరం, ఎస్.కొత్తపల్లె, అక్కంపల్లె ఫీడర్ల కిందనున్న గ్రామాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 3 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేస్తామని వివరించారు.

కులగణన సర్వేలో కానాల-2 సచివాలయం రికార్డు

నంద్యాల(అర్బన్): మేజర్ పంచాయతీ కానాల గ్రామ సచివాలయం-2 సిబ్బంది 96.2 శాతం కులగణన సర్వే పూర్తి చేసి ముందు వరుసలో నిలిచారు. రెండువారాల క్రితం జిల్లాలో ప్రారంభమైన కులగణన సర్వే 88 శాతం మాత్రమే పూర్తవగా నంద్యాల మండలం కానాల గ్రామ సచివాలయం-2 పరిధిలో మాత్రం 96.2శాతం పూర్తవడంపై జిల్లా, మండల స్థాయి అధికారులు సచివాలయ సిబ్బంది, వలంటీర్లను అభినందించారు.

రెడ్‌క్రాస్ సేవలు విస్తరించాలి



టార్పాలిన్ పట్టాలు అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): రెడ్‌క్రాస్ సొసైటీ సేవలు ఎనలేనివని, మరింత విస్తరించాలని నంద్యాల ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని సలీంనగర్ ప్రాంతంలో గుడిసెల్లో నివాసముంటున్న కుటుంబాలకు సొసైటీ అందజేస్తున్న టార్పాలిన్ పట్టాల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జిల్లా కమిటీ సభ్యులు ఉస్మాన్‌బాషా, కోశాధికారి నాగేశ్వరరావు, నాగేశ్వరరెడ్డి, సోహెల్, కౌన్సిలర్ బాసిద్,ఆదిల్ పాల్గొన్నారు.

పరామర్శ

రుద్రవరం: మండలంలోని టి.లింగందిన్నెలో వైఎస్సార్‌సీపీ నాయకుడు వీరశేఖర్‌రెడ్డి కుమారుడు దినేష్‌రెడ్డి ఇటీవల విద్యుత్ ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ఆదివారం అక్కడికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరు, వైద్య చికిత్సలపై ఆరా తీశారు. ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ గంధం రాఘవరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు మోహన్‌రెడ్డి, ఎర్రన్న, ఎంపీటీసీ రామచంద్రారెడ్డి, హరినారాయణ ఉన్నారు.

అభివృద్ధి కొండంత

ఐదేళ్ల క్రితం వరకు అభివృద్ధికి దూరంగా నిలిచింది ఆ పంచాయతీ. చివరకు మండల కేంద్రం నుంచి రోడ్డు సౌకర్యం లేదు. ఇక వీధుల్లో మట్టి రోడ్లే దిక్కు. డ్రైనేజీలు లేక వీధుల్లోనే మురుగు ప్రవాహం ఉండేది. ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాలు లేక విద్యార్థులు అవస్థలు పడేవారు. ఆవరణలో పశువులు సంచరించేవి. ప్రస్తుతం.. వీధుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, నాడు-నేడుతో సకల సౌకర్యాలతో ముస్తాబయిన బడి, ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలు.. ఇలా కోట్లాది రూపాయలతో పనులు చేపట్టడంతో ప్రగతి పథంలో దూసుకెళ్తోంది కోటకొండ గ్రామం.

- ప్రగతి పథకంలో కోటకొండ
- గ్రామంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు
- నూతన కార్యాలయాల భవనాలతో పల్లెకు కొత్త రూపు
- నాడు-నేడుతో ముస్తాబయిన ప్రభుత్వ పాఠశాల
- వీధుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల ఏర్పాటు
- ఇంటింటికీ కుళాయి
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



సచివాలయం, ఆర్బీకే తదితర కార్యాయాలను నిర్మించిన దృశ్యం

ఇది కదా.. అభివృద్ధి

రుద్రవరం: ఆ గ్రామానికి కొంత దూరంలో కొండ..ఆ కొండలో ఓ కోట ఉంది. దీంతో పూర్వం గ్రామానికి కోటకొండగా నామకరణం చేశారు. అయితే గ్రామం ఏర్పడిన నాటి నుంచి అభివృద్ధికి నోచుకోక, కనీస వసతులు లేక గ్రామస్తుల అవస్థలు వర్ణనాతీతం. మండల కేంద్రానికి దాదాపు 15 కి.మీ దూరంలో ఉంది. ఏ చిన్న సమస్య వచ్చినా అక్కడికి వెళ్లడానికి రోడ్డు సౌకర్యం కూడా లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామ రూపు రేఖలే మారిపోయాయి. గ్రామంతో పాటు మజరా గ్రామాలైన కే.కొత్తూరు, చిన్నయ్య స్వామి చెంచు గూడెంలో దాదాపు రూ.2కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయి.

పనులు ఇలా..

- గ్రామసచివాలయం,రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ నిర్మించారు.
- శిథిలావస్థలకు చేరిన పాఠశాలను నాడు-నేడు కూడా పూర్తిగా మార్చి సకల వసతులు కల్పించారు.
- కొత్తగా సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేశారు.
- తాగునీటి సమస్య తలెత్తకుండా కొత్త బోర్లు,మినీ వాటర్ ట్యాంకులు,ఇంటింటికీ కుళాయిలు వేయించారు.



నాడు-నేడు నిధులతో అందంగా ముస్తాబయిన ప్రభుత్వ పాఠశాల

- అలాగే సచివాలయం పరిధిలోని అర్హులకు దాదాపు రూ.14.30 కోట్లు వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందారు.



కే.కొత్తూరులో నూతనంగా వేసిన సీసీ రోడ్డు

ఎమ్మెల్యే సహకారంతోనే పనులు



జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారుడు గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, పుట్టాలమ్మ క్షేత్ర చైర్మన్ గంగుల మనోహర్‌రెడ్డి సహకారంతో గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టాం. సర్పంచుగా ఎన్నికైనప్పటి నుంచి కోటకొండతో పాటు మజరా గ్రామాలైన కె.కొత్తూరు,చిన్నయ్య స్వామి చెంచు గూడెంలో సీసీ రోడ్లు వేయించాం. తాగునీటి సమస్య తలెత్తకుండా 4 మినీ వాటర్ ట్యాంకులు నిర్మించి పైప్ లైన్, ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేశాం. గతంలో ఏ ప్రభుత్వం ఇన్ని అభివృద్ధి పనులు చేయించలేదు.

– వెంకటేష్,గ్రామ సర్పంచు

పిల్లలకు వసతులు కల్పించారు



గతంలో బడి అధ్వాన్నంగా ఉండేది.పెచ్చులూడి పడుతున్నాయని గతంలో టీడీపీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక నాడు-నేడు కింద లక్షలాది రూపాయలు వెచ్చించి పిల్లలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించారు. నాకున్న ఇద్దరు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చదివిస్తున్నా. ఈ ప్రభుత్వ హయాంలో ఎన్నో పనులు చేశారు.

– ఉశేనమ్మ,కోటకొండ

అభివృద్ధి పనులకు వినియోగించిన నిధుల వివరాలు రూ. లక్షల్లో	
1.సచివాలయం,రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ భవనాలకు	79.50
2.గడప గడపకు మన ప్రభుత్వం	20.00
3.ఉపాధి హామీ పథకం	46.00
4.బడి నాడు-నేడు	17.77
5.మండల నిధులు	10.00
6.సీఎండీఎఫ్	9.80
7.ఎస్సీ,ఎస్టీ నిధులు	8.00
8.రాజ్యసభ నిధులు	7.00
9.పంచాయతీ నిధులు	4.00

అభివృద్ధి అదిరింది



వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక మా గ్రామంలో చేపట్టిన అభివృద్ధి అదిరింది. గతంలో ప్రభుత్వ పాఠశాల వైపు ఉన్న దారి సరిగాలేదు. గుంతలమయమై పోయింది. దీంతో అటువైపు పొలాలకు వెళ్లలేక ఇబ్బందులు పడేవాళ్లం. ప్రస్తుతం రోడ్డు వేశారు. అలాగే అదే దారిలో ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించడంతో ఆ ప్రాంతం కొత్తగా కనిపిస్తోంది. దీంతో గ్రామరూపు రేఖలే మారిపోయాయి. ఇంత కంటే ఇంకేం కావాలి.

– అంకన్న,కోటకొండ

అందుబాటులో వైద్యం



గతంలో వైద్యం అందక అలమటించేవాళ్లం. చిన్న రోగమొచ్చినా గాజులపల్లె లేదా నంద్యాలకు వెళ్లాల్సి వచ్చేది. జగనన్న ప్రభుత్వం వచ్చాగా స్థానికంగానే వైద్యం అందుతోంది. వెల్‌నెస్ సెంటర్ నిర్మించి అందులో ఒక ఎంఎల్‌హెచ్‌పీని నియమించడంతో వైద్య సేవలు అందుబాటులో ఉంటున్నాయి. మంచి చేస్తే ఎవరినైనా అభినందించాల్సిందే. గ్రామంలో చాలా పనులు చేశారు.

– వీరభద్రుడు,కోటకొండ

సెలవురోజూ రిజిస్ట్రేషన్లు



బుర్రారెడ్డిపల్లెలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పరిశీలిస్తున్న డిప్యూటీ తహసీల్దార్



ఇంజేడులో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్‌డీఓ మల్లికార్జున్ రెడ్డి

దొర్నిపాడు: మండలంలోని అన్ని సచివాలయల్లో ఆదివారం సెలవు రోజు అయినా కూడా ఇళ్ల స్థలాలకు సంబంధించి ఉచిత రిజిస్ట్రేషన్లు చేయించారు. దొర్నిపాడు, బుర్రారెడ్డిపల్లె, చాకరాజువేముల, కొండాపురం సచివాలయాల్లో జరిగిన రిజిస్ట్రేషన్లను డీటీ శివశంకర్‌రెడ్డి తనిఖీ చేశారు. స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా 9 సచివాలయ పరిధిలో 265 రిజిస్ట్రేషన్లను పూర్తి చేశారని చెప్పారు. సర్వర్ సమస్య ఉండటంతో ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరించారు. వీఆర్‌ఓలు నాగేష్, సావిత్రి, నారాయణస్వామి, జూనియర్ అసిస్టెంట్ చిన్న గోవిందు ఉన్నారు.

స్థలాల రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలి

ఉయ్యాలవాడ : నవరత్నాల్లో పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలని నంద్యాల ఆర్‌డీఓ మల్లికార్జున్‌రెడ్డి సూచించారు. ఆదివారం మండలంలోని ఇంజేడు, అల్లూరు, మాయలూరు, కొండుపల్లె గ్రామ సచివాలయాల్లో జరుగుతున్న స్థలాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను కోవెలకుంట్ల సబ్‌రిజిస్టర్ సర్వేశ్‌నాథ్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఆయా గ్రామ సచివాలయాల్లో 158 మంది స్థలాలకు సంబంధించి ఇప్పటి వరకు 16 మాత్రమే రిజిస్ట్రేషన్లు పూర్తి కావడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియలో తలెత్తుతున్న సాంకేతిక సమస్యలను సచివాలయ సిబ్బంది ఆర్‌డీఓ దృష్టికి తీసుకువచ్చారు. తక్షణమే సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. పంచాయతీ కార్యదర్శులు అబ్దుల్‌రహీం, సురేష్‌బాబు, రాజశేఖర్‌బాబు, వీఆర్‌ఓలు ఉన్నారు.

అక్కాచెల్లెమ్మలూ.. బాబును నిలదీయండి



దొర్నిపాడులో మహిళలకు మెగా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గంగుల



వైఎస్సార్ ఆసరా సంబరాల్లో పాల్గొన్న పొదుపు మహిళలు

దొర్నిపాడు: పొదుపు మహిళలకు ఇచ్చిన మాటను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారని, కానీ.. చంద్రబాబు సమయంలో హామీ అమలు చేయకుండా మిమ్మల్ని మోసం చేశాడని..జగన్‌లాగా ఎందుకు మాట నిలుపుకోలేకపోయావని అక్కాచెల్లెమ్మలంతా నిలదీయాలని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో వైఎస్సార్ ఆసరా నాలుగోవిడత సంబరాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియోకవర్గంలో అత్యధికంగా రూ.7.72 కోట్లు ఆసరా ద్వారా పొదుపు మహిళలకు లబ్ధి చేకూరిందన్నారు. గత పాలనలో హత్యా రాజకీయాలు జరిగాయని ఈ ఐదేళ్లలో తమ ప్రభుత్వం పచ్చచొక్కా వేసుకున్న వారికి కూడా సంక్షేమ పథకాలను ఇంటికే వెళ్లి అందజేసిందని వివరించారు. రానున్న రోజుల్లో పగటి వేషగాళ్లు వస్తారని.. వారి మాటలను నమ్మవద్దన్నారు. నాడు అమ్మ ఒడి ఇస్తే రాష్ట్రం మరో శ్రీలంక అవుతుందన్న బాబు ఈ రోజు ఇంట్లో ఉన్న ఎంత మంది పిల్లలకైనా అమ్మఒడి ఇస్తానని చెబుతున్నాడంటే.. వారి మిమ్మల్ని మోసం చేసేందుకే ఇలాంటి కబుర్లు చెబుతారన్నారు. మండలంలో సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లుగా చేశామన్నారు. అందరికీ మేలు చేస్తున్న జగనన్నను మరోమారు ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ శకుంతల, సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వరావు, వైఎస్సార్‌సీపీ మండల వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడి, సర్పంచులు మాధవీలత, మాధవీ, దేవమణి, బాలసుబ్బయ్య, శివరామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ శివారెడ్డి, ఎంపీడీఓ సుబ్బారెడ్డి, వెలుగు ఏపీఎం బాబు, నాయకులు మనోహర్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, బత్తుల కృష్ణయ్య, నర్సిరెడ్డి, శంకర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, బాలసుబ్బయ్య పాల్గొన్నారు.

ఎన్నికల సమరానికి సిద్ధం కావాలి

ఆళ్లగడ్డ: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల సమరానికి వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా సైనికులు సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ల సమావేశం నిర్వహించారు. ప్రజలకు మేలు జరుగుతుండటాన్ని పచ్చమీడియా, ప్రతిపక్షాలు ఓర్వలేక అసత్య ఆరోపణలు చేస్తున్నాయని, నిజాలను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందున్నారు. ఆరోణలను ఉపేక్షించొద్దని వాస్తవమేంటి, వారు చేస్తున్న కుట్రలను ఆధారాలతో సహా బయటపెట్టాలని సూచించారు. నాయకులు గంగుల అవంతి, విజయసింహారెడ్డి ఉన్నారు.



సిద్ధం పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే గంగుల

భక్తి శ్రద్ధలతో ఎరుకలస్వామి ఆరాధన





ప్రత్యేక అలంకరణలో ఎరుకలస్వామి, ఎమ్మెల్యేను సత్కరిస్తున్న నాయకులు

దొర్నిపాడు: మండలకేంద్రంలో వెలసిన శ్రీ ఆది అల్లూరి ఎరుకల స్వామి ఆరాధనోత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. రాత్రి భజన పోటీలు ఏర్పాటు చేసి గెలిపొందిన వారికి నగదు బహుమతులు అందజేశారు. ఉత్సవ పూజల్లో ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పాల్గొన్నారు. యాదవకార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు, బత్తుల క్రిష్ణయ్య, గోపాల్, నాగయ్య పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించండి



మాట్లాడుతున్న ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో ఆదివారం ఎంపీడీఓ రమణారెడ్డి అధ్యక్షతలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల స్థాయి అధికారులు తమ శాఖల ప్రగతిని చదివి వినిపించారు. ఎంపీపీ మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించుకోవడానికే సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని, సభ్యులు ప్రజా సమస్యలను సభ దృష్టికి తెచ్చి పరిష్కారానికి కృషి చేయాలని చెప్పారు. అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. వైస్ ఎంపీపీ నాసారి ప్రసాద్, కొలిమి దాదాపీర్, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని బొమ్మలసత్రం, మద్దూరు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు పరీక్షల ప్యాడ్, నోట్ పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేసినట్లు సుదర్శన్‌రెడ్డి, కుమార్ ఆదివారం సాయంత్రం తెలిపారు. వారు మాట్లాడుతూ ధన ధర్మ చారిటబుల్ ట్రస్టు, హిందూ ఐక్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో పంపిణీ చేసినట్లు తెలిపారు.

పెద్దమ్మకు ప్రత్యేక పూజలు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచే మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. పలువురు గాజులు, నిమ్మకాయలు, చీరలు, పిండివంటలు మొక్కుగా చెలించారు.

దూదేకులు రాజకీయంగా ఎదగాలి

నంద్యాల(వ్యవసాయం): దూదేకులు రాజకీయంగా, సామాజికంగా ఎదగాలని ఏపీ దూదేకుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పీర్‌మహమ్మద్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక వాసవీ హైస్కూల్‌లో నంద్యాల జిల్లా దూదేకుల ఉద్యోగుల ఆత్మీయ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం దూదేకుల విద్యార్థులకు విద్యాపరంగా స్కాలర్‌షిప్‌లు పలు అంశాలపై తీర్మానం చేశారు. సంఘం ఉపాధ్యాయ విభాగం రాయచోటి సిద్దయ్య, జిల్లా అధ్యక్షుడు దస్తగిరి, నంద్యాల జిల్లా దూదేకుల ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కన్నయ్య, బాబన్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

నంద్యాల(అర్బన్): ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక నూతన కార్యవర్గ ఎన్నిక కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలిగా ప్రసన్నకుమారి, కార్యదర్శిగా సత్యనారాయణ గుప్త, కోశాధికారిగా రహంతుల్లా, ఉపాధ్యక్షులు రామచంద్రుడు, హుసేన్‌లను ఎన్నుకున్నారు. ఆకుమల్ల రహీం మాట్లాడుతూ సమాజహితం కోరే వారు రాజకీయ పార్టీలకు అతీతంగా తమ సంస్థలో చేరవచ్చన్నారు.

ఐక్యవేదిక పట్టణ అధ్యక్షుడు మస్తాన్‌వలి, శివశంకర్, ముస్తక్‌అహమ్మద్, రామరాజు, రాజయ్య, మధు, సౌజన్య, వెంకటరమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఈరోజు

జనఔషధి కేంద్రం ప్రారంభం

దొర్నిపాడు: మండలంలోని గుండుపాపల సహకార సంఘం ఆవరణలో చైర్మన్ బాలవెంకటరెడ్డి అధ్యక్షతన సోమవారం జనఔషధి కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు సీఈఓ సుబ్బారావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా సహకార అధికారి వెంకటసుబ్బయ్య, జిల్లా సహకార ఆడిట్ అధికారి వెంకటకృష్ణ, ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి, కేడీసీసీ బ్యాంక్ జనరల్ మేనేజర్ శివలీల, కోవెలకుంట్ల కేడీసీసీ బ్యాంక్ ఛీఫ్ మేనేజర్ అమర్‌నాథ్‌రెడ్డి, సబ్‌డివిజినల్ సహకార అధికారి లక్ష్మినారాయణ, రిటైర్డ్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ స్టీఫెన్ హాజరవుతారని వివరించారు.

స్పందన

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ తులసీకృష్ణ ఆదివారం తెలిపారు. గ్రామ సచివాలయాల్లో ప్రతి రోజు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తారని, అక్కడ సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోతే మండల కేంద్రంలో జరిగే కార్యక్రమానికి హాజరై అర్జీలు సమర్పించాలని కోరారు.

వద్దిరాలకు వెళ్లి పింఛన్ అందజేత



చిన్న వీరమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ఆవుల ఆదిలక్ష్మి

ఉయ్యాలవాడ : మండల కేంద్రానికి చెందిన చిన్న వీరమ్మ అనారోగ్య రీత్యా వైఎస్సార్ కడప జిల్లా మైలవరం మండలం వద్దిరాల గ్రామంలో బంధువుల ఇంట్లో ఉంటోంది. విషయం తెలుసుకున్న గ్రామ వలంటీర్ ఆవుల ఆదిలక్ష్మి అక్కడి వెళ్లి ఆదివారం పింఛన్ సొమ్ము రూ. 3 వేలు అందజేశారు. వలంటీర్ దివ్యాంగురాలైనప్పటికీ వ్యయప్రయాసోలకోర్చి అంతదూరం వెళ్లి పింఛన్ అందజేయడంపై పలువురు అభినందించారు.

రైతాంగాన్ని మోసం చేసిన కేంద్ర ప్రభుత్వం



గాంధీచౌక్‌లో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

నంద్యాల(న్యూటౌన్): బడ్జెట్ కేటాయింపులో రైతాంగాన్ని కేంద్ర ప్రభుత్వం మోసం చేసిందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్‌కుమార్ విమర్శించారు. ఆదివారం పట్టణంలోని గాంధీచౌక్‌లో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు.ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి నిధులు కేటాయింపులో కోత విధించడం తగదన్నారు. వ్యవసాయ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, పరికరాలు ధరలు విపరీతంగా పెరిగి రైతులపై భారం పడిందన్నారు. మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తుల ఆస్తులు పెంచడం కోసమే తప్ప రైతాంగాన్ని అభివృద్ధి చేయడం లేదని మండిపడ్డారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు రామచంద్రుడు, నరసింహులు, సుధాకర్, వెంకటలింగం పాల్గొన్నారు.

మహానందిలో భక్తజన సందడి



ఏపీఎస్పీడీసీఎల్ ఫైనాన్స్ డైరెక్టర్ వీఎన్‌బాబుకు స్వామి వారి చిత్రం అందజేస్తున్న దృశ్యం



మహానందీశ్వరుడి దర్శనార్థం వేచి ఉన్న భక్తులు

మహానంది: క్షేత్రంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వేకువజామున అష్టవిధ మహా మంగళ హారతుల సేవల నుంచి శ్రీ కామేశ్వరీ దేవి సహిత మహానందీశ్వర స్వామి వారి దర్శనం ప్రారంభమైంది. సెలవురోజు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు వివిధ ప్రాంతాల భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి, అమ్మవారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. బండిఆత్మకూరు మండలంలోని ఓంకారం పుణ్యక్షేత్రం ఆదివారం భక్తులతో కళకళలాడింది. వేలాది సంఖ్యలో భక్తులు, శివదీక్షా స్వాములు ఆలయానికి చేరుకున్నారు. ఈ మేరకు వారు శ్రీ గంగా, ఉమా సమేత ఓంకార సిద్ధేశ్వరస్వామి వారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు. శివదీక్షా స్వాములు భజనలు చేస్తూ పూజలు జరిపారు.

మహానందీశ్వరుడి సేవలో..

శ్రీ కామేశ్వరీ దేవి సహిత మహానందీశ్వర స్వామి వారికి ఏపీ ఎస్పీడీసీఎల్ ఫైనాన్స్ డైరెక్టర్ వీఎన్ బాబు కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం పూజలు నిర్వహించారు. వారితో పాటు నంద్యాల డీఆర్‌ఓగా పనిచేస్తూ బదిలీ అయిన పుల్లయ్య, నంద్యాల డీఎస్పీ మహేశ్వరరెడ్డిలు వేర్వేరుగా మహానందికి వచ్చారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికారు. వారు స్వామివారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు చేశారు. దర్శనం అనంతరం ఆలయంలో ఉన్న స్థానిక అలంకార మండపంలో వేద పండితులు వారికి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.

ఉంగరం అప్పగింత..

చాగలమర్రికి చెందిన భక్తుడు శ్రీనివాసశర్మ మహానందీశ్వర స్వామి దర్శనార్థం ఆదివారం మహానందికి వచ్చారు. కోనేరులో స్నానం చేస్తుండగా బంగారు ఉంగరం పడిపోయింది. విషయం తెలుసుకున్న టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రంగన్న సిబ్బంది చేత వెతికించి బాధితుడికి అప్పగించారు.